E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 15-01-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక: 15|| పేజీలు–6 www.ekaburu.com



సరికొత్త గరిష్ఠాలకు బంగారం, వెండి ధరలు.. కారణమేంటి?

» 4లో



## శుభాకాంక్షలు

మకర సంక్రాంతి సందర్భంగా మా పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు

## సెలవు

పండుగ సందర్భంగా గురువారం ఈ-కబురు, కార్యాలయానికి సెలవు. శుక్రవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం 17వ తేదీ శనివారం


# గ్లోబల్ ఫెస్టివల్ పొంగల్



- ప్రధాని మోదీ గోపూజ.
- ప్రాచీన నాగరికతను ప్రతిబింబించే గొప్ప పండుగ
- ప్రకృతిని కాపాడుకోవాలన్న సందేశం ఇస్తోంది
- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- ఢిల్లీలో కేంద్ర మంత్రి మురుగన్
- నివాసంలో పొంగల్ వేడుకలు
- గోపూజ చేసి, పొంగలి వండిన ప్రధానమంత్రి

ఈకబురు, న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన నాగరికతను ప్రతిబింబించే గొప్ప పండుగ పొంగల్ అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఇది ప్రపంచ స్థాయి పండుగగా మారిందని ప్రశంసించారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకలకు ప్రధాని మోదీ హాజరయ్యారు. ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, కె.రామ్మోహన్ నాయుడితోపాటు పలువురు అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ గోపూజ చేశారు. స్వయంగా పొంగలి వండారు. తమిళ సంప్రదాయం ప్రకారం ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. పంటలు ఇచ్చే భూమికి, సూర్యుడికి కృతజ్ఞతలు తెలియజేస్తూ పొంగల్ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని గుర్తుచేశారు. పండుగ పరమార్థంలో రైతన్నల శ్రమ కూడా దాగి ఉందన్నారు. ప్రకృతిని కాపాడుకుంటూ ముందుకు సాగాలన్న సందేశాన్ని పొంగల్ ఇస్తోందని తెలిపారు. ప్రపంచంలో తమిళులు ఎక్కడున్నా సరే పొంగల్‌ను ఉత్సాహంగా నిర్వహించుకుంటారని, తమిళ సంస్కృతిని సుసంపన్నం చేసుకోవడంలో వారు ముందుంటారని గుర్తుచేశారు. పొంగల్ గ్లోబల్ ఫెస్టివల్‌గా మారడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు.

తరువాయి 2లో



## తెలంగాణ మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఖరారు

**నోటిఫికేషన్ జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**

ఈకబురు హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 121 మున్సిపాలిటీలు, 10 మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డులు, చైర్పర్సన్, మేయర్ పదవులకు సంబంధించిన రిజర్వేషన్లను ఖరారు చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, అన్‌రిజర్వ్డ్ కేటగిరీలకు సీట్ల కేటాయింపునకు మార్గదర్శకాలను, డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లను ప్రభుత్వం ప్రకటించింది.

తరువాయి 2లో

## ఇరాన్‌లో భారతీయులకు హైఅలర్ట్



- ఇరాన్‌లో తీవ్ర ఉద్రిక్తతలు – భారతీయులకు హై అలర్ట్
- ఇరాన్‌ను వెంటనే విడిచిపోవాలి: భారత ప్రభుత్వం
- టెహ్రాన్‌లో ప్రమాదకర పరిస్థితులు – ఎంబసీ హెచ్చరిక
- నిరసనల మధ్య చిక్కుకున్న ఇరాన్ – వేలల్లో మృతులు

**భారతీయులు సురక్షిత దేశాలకు వెళ్లాలని సూచన**

ఈకబురు: టెహ్రాన్/న్యూఢిల్లీ: ఇరాన్‌లో పరిస్థితులు రోజురోజుకీ దిగజారుతున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం టెహ్రాన్‌లోని భారతీయులకు అలర్ట్ జారీ చేసింది. ''ఇరాన్‌లో పరిస్థితులు మరింతగా దిగజారుతున్నాయి. భారతీయులు వెంటనే ఇరాన్‌ను వీడాలి. సురక్షిత దేశాలకు వెళ్లాలి. ఇరాన్‌లోని భారతీయ విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారులు వీలైనంత తర్వగా ఆ దేశం నుంచి బయట పడాలి'' అని భారత విదేశాంగ శాఖ బుధవారం ఓ ప్రకటనను విడుదల చేసింది.

తరువాయి 2లో

## తప్పు చేయకపోతే ఎందుకు భయపడుతున్నారు?: సీపీ సజ్జనార్

ఈ-కబురు, హైదరాబాద్: ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధులు దొంతు రమేష్, సుధీర్‌ల అరెస్టుపై సీపీ స్పందించారు

» 2లో



## చైనా మాంజాకు మరో ప్రాణం బలి



ఈ-కబురు: చైనా మంజా వాడకంపై ప్రజలకు ఎంత అవగాహన కల్పించిన తీరు మార్చుకోవడం లేదు. పండగ వేళ సరదాగా ఎగరవేసే పతంగులు కొంతమంది పాలిట మృత్యపాశాల్లా మారుతున్నాయి. తాజాగా కర్ణాటకాలో చైనా మాంజాతో తీవ్రగాయాలై ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో పండగ వేళ ఆకుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

తరువాయి 2లో



'జర్నలిస్టులపై కాంగ్రెస్ సర్కార్ తీరు అనైతికం'

» 2లో

## వీధివీధి తిరగాలి.. విజయబావుటా ఎగరాలి

- మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ వ్యూహం
- పట్టణాలవారీగా ముఖ్యనేతలకు బాధ్యతలు
- రేపు సీఎం సభతో ప్రచారానికి శ్రీకారం



ఈ-కబురు, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో వెలువడనున్న నేపథ్యంలో కాంగ్రెస్ గెలుపు వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఈ నెల 16న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసే సభతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారానికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని మున్సిపాలిటీల్లో ప్రచారం, అభ్యర్థుల ఎంపికపై పార్టీలో అంతర్గతంగా చర్చిస్తున్నారు. ప్రతి మున్సిపాలిటీలో కాంగ్రెస్‌ను గెలిపించే బాధ్యతను ముఖ్యనేతలకు అప్పగించనున్నారు. ఇప్పటికే ప్రతి జిల్లాలోని మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతలు అక్కడి పురపాలికలపైనే దృష్టి సారించాలని పీసీసీ సూచించింది.

తరువాయి 2లో

## రైలుపై కుప్పకూలిన భారీ క్రేన్.. ఏకంగా 22 మంది దుర్మరణం

నిర్మాణంలో ఉన్న భారీ క్రేన్ ట్రైన్‌పై కూలిన ఘటన థాయిలాండ్ లో చోటుచేసుకుంది



తరువాయి 2లో



అసలైన విజయం ఇదే

» 5లో



## భారత్‌ను ఆశ్రయిస్తున్న ఇరాన్..!

అశాంతి, ఆందోళనలు ఒకవైపు.. యుద్ధం చేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి బెదిరింపులు.. వెరసి ఇరాన్ ప్రభుత్వం కకలావికలం అవుతోంది. ఈ నేపథ్యంలో భారత్‌ను ఆశ్రయించే ప్రయత్నం చేస్తోంది.

తరువాయి 2లో

## ఎర్ర సముద్రంలోకి అమెరికా నౌక..



ఇరాన్‌పై యుద్ధం దిశగా అమెరికా సన్నాహాలను వేగవంతం చేస్తోంది. యూఎస్ విమాన వాహక నౌక రూజ్ వెల్ట్ ఇటీవలే ఎర్ర సముద్రంలోకి ప్రవేశించింది. ఈ మేరకు యూఎస్ సైనిక అధికారులను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ తెలిపింది.

తరువాయి 2లో



# ఇరాన్‌లో మారణహోమం.. వేలాది మంది మృతి?

**తమిళ వారసత్వం నుంచి స్ఫూర్తి పొందుతున్నాం**

**"కృతజ్ఞత అనేది కేవలం మాటలకే పరిమితం కావొద్దని, నిత్య జీవితంలో అది అంతర్భాగం కావాలని పొంగల్ మనకు గుర్తుచేస్తుంది. మనం జీవించడానికి ఎన్నో ఇస్తున్న భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత. పొంగల్ పండుగలో భాగం కావడం గర్వంగా భావిస్తున్నా. ప్రపంచంలో ఇప్పటికీ మనుగడలో ఉన్న ప్రాచీన నాగరికతల్లో తమిళ నాగరికత, సంస్కృతి ఉన్నాయి. ఇది శతాబ్దాల జ్ఞానం, సంప్రదాయాల సమ్మేళనం. చరిత్ర నుంచి పాఠాలను స్వీకరిస్తూ భవిష్యత్తుకు దారిచూపుతున్న మహోన్నత సంస్కృతి ఇది. తమిళ వారసత్వం నుంచి స్ఫూర్తి పొందుతున్నాం.**

సాంస్కృతిక మూలాల ద్వారా బలోపేతం అవుతూ ముమ్ముందుకు సాగుతున్నాం. ప్రకృతి, కుటుంబం, సమాజం మధ్య సుహృద్భావ బంధం ఉండాలన్న పొంగల్ సందేశాన్ని మనమంతా స్వీకరిద్దాం. భవిష్యత్తు తరాల బాగు కోసం భూమి నిస్సారం కాకుండా రక్షించుకోవడం, జల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం, వనరులను తెలివిగా, పరిమితంగా ఉపయోగించుకోవడం అత్యవసరం. ఇందులో భాగంగానే మిషన్ లైఫ్, ఏక్ పేడ్ మా కే నామ్, అమృత్ సరోవర్ వంటి పథకాలు తీసుకొచ్చాం. ఐక్యత, విశ్వాసం మన బలం. భూమిని గౌరవించుకోవడం మన సంస్కృతిలో అంతర్భాగం'' అని ప్రధాని మోదీ వెల్లడించారు.

**సందడి చేసిన 'పరాశక్తి' టీమ్**

కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకల్లో తమిళ సినీ నటులు కూడా సందడి చేశారు. తమిళ చిత్రం 'పరాశక్తి'లో నటించిన శివకార్తికేయన్, రవి మోహన్, సంగీత దర్శకుడు జి.వి.ప్రకాశ్ కుమార్ పొంగల్ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ప్రధానమంత్రితో కలిసి పొంగల్ నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందని వారు తెలిపారు. 1960వ దశకంలో తమిళనాడులో జరిగిన హిందీ వ్యతిరేక నిరసన కార్యక్రమాల ఆధారంగా పరాశక్తి చిత్రాన్ని తెరకెక్కించారు. దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ పేరును ఇందులో ప్రస్తావించడం పట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

**ప్రజలకు మోదీ పొంగల్ శుభాకాంక్షలు**

పొంగల్ సందర్భంగా ప్రధాన మోదీ తమిళం, ఆంగ్ల భాషల్లో ప్రజలకు బుధవారం లేఖ రాశారు. కష్టపడి పనిచేస్తూ మన జీవితాల్లో వెలుగులు నింపుతున్న వారికి కృతజ్ఞతలు తెలియజేసే పండుగే పొంగల్ అని పేర్కొన్నారు. దేశ ప్రజలకు పొంగల్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు సుఖ సంతోషాలు, సౌభాగ్యం, మంచి ఆరోగ్యంతో విలసిల్లాలని ఆకాంక్షించారు. ఈ పండుగతో వ్యవసాయం, అన్నదాతలు, గ్రామీణ, జీవితానికి బలమైన అనుబంధం ఉందన్నారు. ఈ సందర్భంగా కుటుంబాలు కలుస్తుంటాయని, ప్రజలు కష్టసుఖాలు కలబోసుకుంటారని, వారి మధ్య బంధం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఐక్యతా స్ఫూర్తిని పొంగల్ మరింత బలోపేతం చేస్తోందన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన భాష అయిన తమిళం మన దేశంలో ఉన్నందుకు మనం గర్వించాలని మోదీ ఉద్ఘాటించారు.





## చైనా మాంజాకు మరో ప్రాణం బలి



సంక్రాంతి పండుగకు గాలిపటాలు ఎగురవేయడం హిందూ సంప్రదాయంలో భాగం. అందుకే దేశవ్యాప్తంగా పెద్ద, చిన్నా తేడా లేకుండా పతంగులు ఎగురవేసి తమ సంతోషాన్ని చాటుకుంటారు. పతంగులు ఎగురవేయడం కోసం వాడే చైనా మాంజా వల్ల ఎంతోమంది ప్రమాదాలకు గురవడంతో పాటు కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. పక్షులసైతం పెద్దఎత్తున మాంజా దారం తగిలి మరణిస్తున్నాయి. దీనిపై ప్రజల్లో ఎంత అవగాహన కల్పించినా తీరుమారడం లేదు.

కర్ణాటక బీదర్ జిల్లా తలమడిగి బ్రిడ్జి వద్ద సంజూ కుమార్ అనే ఓవ్యక్తి బైక్ నడుపుతూ వస్తుండంగా రోడ్డుపై ఉన్న చైనా మంజా అతని ముఖానికి తగిలింది. దీంతో తలకు తీవ్రగాయాలైన సంజూ కుమార్ అక్కడికక్కడే కుప్పకూలారు. అతికష్టంమీద వారి కుమార్తెకు ఫోన్ చేసి జరిగింది చెప్పారు. అంతలోనే అక్కడే ఉన్న స్థానికులు రక్తం ఎక్కువగా పోకుండా కాటన్ గుడ్డ కట్టి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అయితే అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిన సంజూకుమార్ అంబులెన్స్ వచ్చే సరికే ప్రాణాలు వదిలారు.

అయితే అంబులెన్స్ సమయానికి చేరుకుంటే ఆయన ప్రాణాలు దక్కేవని సంజూ కుమార్ తరపు బంధువులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పతంగిలు లేపడానికి చైనా మాంజా వాడకుండా నిషేదం విధించాలని అక్కడే ధర్నా చేపట్టారు. ఇటీవల చైనా మాంజాతో ప్రమాదానికి గురైన ఘటనలు తరచుగా జరుగుతున్నాయి.

## భారత్‌ను ఆశ్రయిస్తున్న ఇరాన్..!

మొదటి పేజీ తరువాయి

ట్రంప్‌ను ఎదుర్కొనేందుకు భారతే అండగా ఉంటుందని ఇరాన్ అధినాయకత్వం భావిస్తోంది. ఈ క్రమంలో ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చి తాజాగా భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌కు ఫోన్ చేశారు. ఈ విషయాన్ని జైశంకర్ స్వయంగా ఎక్స్ లో బుధవారం పోస్టు చేశారు. ఆ వెంటనే ఇరాన్‌లోని భారతీయులు వెంటనే ఆ దేశాన్ని వీడాలంటూ విదేశాంగ శాఖ సర్క్యులర్ జారీ చేయడం గమనార్హం..!

అయితే.. తమ మధ్య జరిగిన సంభాషణ వివరాలను జైశంకర్ పంచుకోలేదు. ఇరాన్‌లో పరిస్థితులపై చర్చించినట్లు మాత్రం వెల్లడించారు. ఈ ఫోన్ కాల్ ద్వారా ఇరాన్ ఇప్పుడు భారత్ మద్దతు కోరుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇదే అంశంపై మంగళవారం కూడా మంత్రి జైశంకర్ ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్(ఐఓఆర్ఏ) సెక్రటరీ జనరల్ సంజీవ్ రంజన్‌తో సమావేశమయ్యారు. ఐఓఆర్ఏ సభ్య దేశాల మధ్య సహకారానికి సంబంధించిన కీలక రంగాలను సమీక్షించారు. ప్రభుత్వాలు, వ్యాపారాలు, విద్యాసంస్థలకు సంబంధించిన సంబంధాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించినట్లు భారత విదేశాంగ శాఖ పేర్కొంది.



## ఎర్ర సముద్రంలోకి అమెరికా నౌక..



అదే సమయంలో, మధ్యప్రాచ్య ప్రాంతంలో అమెరికా సైన్యానికి చెందిన ఒక జలాంతర్గామితో పాటు మూడు క్షిపణి విధ్వంసక నౌకలు కూడా మోహరించబడి ఉన్నాయని ఆ వార్తాపత్రిక తెలిపింది. ఇరాన్ అణు కార్యక్రమం, క్షిపణి స్థావరాలను లక్ష్యంగా చేసుకుని చేపట్టవచ్చిన చర్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు పెంటగాన్ పలు ఎంపికలను సమర్పించింది. వీటిలో సైబర్ దాడులు అలాగే హోంల్యాండ్ సెక్యూరిటీ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకునే చర్యలు కూడా ఉన్నట్లు సమాచారం.

ప్రాంతీయ భద్రతా పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో, ఎర్ర సముద్రం, మధ్యప్రాచ్య ప్రాంతంలో అమెరికా సైనిక ఉనికిని బలోపేతం చేయడం ద్వారా తమ మిత్ర దేశాలకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఇరాన్‌కు అనుబంధంగా ఉన్న సాయుధ గుంపులు వాణిజ్య నౌకలపై దాడులు పెంచుతున్న నేపథ్యంలో, సముద్ర మార్గాల రక్షణకు ఈ మోహరింపు కీలకంగా మారింది.

ఇదిలా ఉండగా, ఇరాన్‌తో ప్రత్యక్ష సైనిక ఘర్షణకు దిగకుండా ఒత్తిడి పెంచడమే అమెరికా వ్యూహంగా కనిపిస్తోంది. దౌత్యపరమైన మార్గాలను తెరిచి ఉంచుతూనే, అవసరమైతే సత్వర స్పందనకు సిద్ధంగా ఉన్నామని సంకేతాలు పంపడమే ఈ సైనిక కదలికల ఉద్దేశమని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిణామాలు ప్రాంతీయ రాజకీయాలపై, అలాగే ప్రపంచ చమురు మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## తప్పు చేయకపోతే ఎందుకు భయపడుతున్నారు?: సీపీ సజ్జనార్

**'మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలి. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారు? పిలిస్తే.. విచారణకు రావాలి కదా. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారు. అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం.త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుంది. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి.సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోంది"అని సీపీ తెలిపారు.**




మొదటి పేజీ తరువాయి

## ఇరాన్‌లో భారతీయులకు హైఅలర్ట్



ఈ నెల 5న జారీ చేసిన అలర్ట్ తో పోలిస్తే.. పరిస్థితులు మరింతగా దిగజారుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేసింది. నిరసనలు జరుగుతున్న ప్రదేశాలు, రద్దీ ప్రాంతాలకు వీలైనంత దూరంగా ఉండాలని సూచించింది. నిత్యం టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులతో టచ్‌లో ఉండాలని ఆదేశించింది. స్థానిక మీడియా ద్వారా ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ తెలుసుకోవాలని పేర్కొంది.మరోవైపు టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చితో బుధవారం సాయంత్రం ఫోన్‌లో చర్చలు జరిపింది. కాగా.. ఇరాన్ అల్లర్లలో మరణాల సంఖ్య 12 వేలకు పెరిగినట్లు 'ద గార్డియన్' పత్రిక వెల్లడించింది. నిరసనకారులతోపాటు.. భద్రతాబలగాలు కూడా మృతిచెందినట్లు వివరించింది. బుధవారం సాయంత్రం 300 మృతదేహాలను టెహ్రాన్ వర్సిటీ ప్రాంగణంలో సామూహికంగా ఖననం చేస్తున్న దృశ్యాలను ప్రచురించింది. అయితే.. అమెరికాకు చెందిన మానవ హక్కుల సంస్థ మాత్రం ఇప్పటి వరకు 2,550 మరణాలు నమోదైనట్లు తెలిపింది. వీరిలో 2,403 మంది నిరసనకారులు కాగా.. మిగతా 147 మంది ఐఆర్‌జీసీ, పోలీసు బలగాలకు చెందినవారని వివరించింది.

## తెలంగాణ మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఖరారు



మున్సిపాలిటీల్లో వార్డుల రిజర్వేషన్‌పైనా ప్రభుత్వం నోటిఫికేషన్‌లో మార్గదర్శకాలను పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సీట్ల కేటాయింపుపై స్పష్టమైన మార్గదర్శకాలు ప్రకటించింది. మొత్తం రిజర్వేషన్లు 50% మించకూడదనే రాజ్యాంగ మార్గదర్శకాలను ప్రభుత్వం పాటించినట్లు స్పష్టం చేసింది.

ముఖ్య మార్గదర్శకాలు

జనాభా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ సీట్ల కేటాయింపు

బీసీ రిజర్వేషన్ డెడికేటెడ్ కమిషన్ సిఫారసుల మేరకు అమలు

మహిళలకు మొత్తం సీట్లలో 50% రిజర్వేషన్లు..

మహిళా రిజర్వేషన్ లాటరీ విధానంలో ఖరారు

తాజా జనగణన డేటా ఆధారంగా సీట్ల ఖరారు

SEEEPC సర్వే-2024 డేటా ఆధారంగా బీసీ రిజర్వేషన్లు

గత ఎన్నికల్లో రిజర్వ్ అయిన వార్డులు ఈసారి మినహాయింపు

మున్సిపాలిటీల్లో వార్డులకు 2011 జనగణన ఆధారంగా ఎస్సీ, ఎస్టీ సీట్ల కేటాయింపు

బీసీలకు ప్రత్యేక కమిషన్ సిఫార్సుల మేరకు రిజర్వేషన్

మహిళలకు (జనరల్) 2019 టీఎం చట్టం ప్రకారం సీట్లు

ప్రతి మున్సిపాలిటీలో మొత్తం వార్డుల సంఖ్య ఖరారు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా, అన్‌రిజర్వ్డ్ సీట్ల స్పష్టమైన విభజన

గ్రేటర్ కాకుండా అన్ని మున్సిపాలిటీలకు వర్తింపు

జిల్లా వారీగా రిజర్వేషన్ పట్టికలు విడుదల

## 'జర్నలిస్టులపై కాంగ్రెస్ సర్కార్ తీరు అనైతికం'

ఈకబురు, హైదరాబాద్: జర్నలిస్టులపై కాంగ్రెస్ సర్కారు తీరు అనైతికమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. నోటీసుల ఇవ్వకుండా అరెస్ట్ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఓ వార్తకు సంబంధించి ఎన్టీవీకి చెందిన పలువురు జర్నలిస్టులను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేయడాన్ని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. విచారణ చేయకుండా చర్యలు తీసుకోవడం సరికాదని, జర్నలిస్టులను బెదిరించి భయపెట్టి చర్యలకు పాల్పడకూడదన్నారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేవారు కిషన్‌రెడ్డి

**అర్థరాత్రి జర్నలిస్టుల అరెస్ట్ సరికాదు బండి సంజయ్**

ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అర్థరాత్రి జర్నలిస్టులను అరెస్ట్ చేయడం తగదన్నారు బీజేపీ ఎంపీ బండి సంజయ్. పోలీసులు చట్ట ప్రకారం నడుచుకోవాలన్నారు బండి సంజయ్

**పోలీసుల తీరు సమర్థనీయం కాదు కొమ్మినేని**

ఎన్టీవీకి చెందిన జర్నలిస్టులను అరెస్ట్ చేసే వ్యవహారంలో పోలీసుల తీరు సమర్థనీయం కాదన్నారు రాజకీయ విశ్లేషకులు కొమ్మినేని శ్రీనివాసరావు. సోదాల పేరుతో మీడియా సంస్థలన ఇబ్బంది పెట్టొద్దన్నారు కొమ్మినేని.

**జర్నలిస్టుల అరెస్ట్‌ను ఖండిస్తున్నాం: పల్లా**

జర్నలిస్టుల అరెస్ట్‌ను బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఖండించారు. అర్ధరాత్రి తలుపులు పగులగొట్టి జర్నలిస్టులన అరెస్ట్ చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ సర్కార చర్యలు ఎమెర్జెన్సీని తలపిస్తున్నాయని, అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు పల్లా.



# రైలుపై కుప్పకూలిన భారీ క్రేన్.. ఏకంగా 22 మంది దుర్మరణం



నిర్మాణంలో ఉన్న భారీ క్రేన్ ట్రైన్‌పై కూలిన ఘటన థాయిలాండ్ (Thailand)లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బ్యాంకాక్ (Bangkok)కు ఈశాన్యంగా 230 కిలో మీటర్ల దూరంలో ఉన్న నఖోన్ రాట్చసిమా (Nakhon Ratchasima) ప్రావిన్స్‌లోని సిఖియో జిల్లాలో బ్యాంకాక్ నుంచి ఉబోన్ రాట్చథానీకి 195 మంది ప్రయాణికులతో వెళ్తున్న రైలుపై.. చైనా సహకారంతో నిర్మిస్తున్న హై-స్పీడ్ రైలు ప్రాజెక్టుకు చెందిన భారీ క్రేన్ అకస్మాత్తుగా కూలింది.

ఈ దుర్ఘటనలో ఇప్పటి వరకు మొత్తం 22 మంది ప్రయాణికులు మృతిచెందగా, మరో 30 మందికిపైగా గాయపడినట్లుగా తెలుస్తోంది. క్రేన్ పడటంతో రైలు బోగీలు పట్టాలు తప్పాయి. ప్రమాదం జరిగిన వెంటనే రైలులో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను వెలికితీసేందుకు స్థానిక పోలీసులు, రెస్క్యూ టీమ్స్ తీవ్రంగా శ్రమిస్తున్నాయి. మృతుల సంఖ్యను నఖోన్ రాట్చసిమా పోలీస్ చీఫ్ ధృవీకరించారు. ఈ ఘోర ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని థాయ్‌లాండ్ రవాణా మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# ముంబైని గెలిచేదెవరు?



దాదాపు దశాబ్ద కాలం తర్వాత బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)కి గురువారం ఎన్నికలు జరగబోతున్నాయి. రెండు కోట్లమంది జనాభాతో, కోటి మూడు లక్షలమంది ఓటర్లతో ఉండే ఆ మహానగరం మొగ్గు ఎటువైపుందోనన్న ఉత్కంఠ సామాన్యుల్లో మాత్రమే కాదు... రాజకీయపక్షాల్లో సైతం నెలకొనివుంది. ఇన్నాళ్లూ కరోనా మహమ్మారి, ఓబీసీ కోటాపై నడిచిన కోర్టు కేసులు ఎన్నికలకు ఆటంకంగా నిలిచాయి. దేశంలోనే అత్యంత సంపన్నవంతమైన కార్పొరేషన్‌గా, దాదాపు రూ. 60,000 కోట్ల బడ్జెట్‌తో ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతాలను ముంబై మించిపోయింది. అధికార మహాయుతి కూటమిలో ఉంటూ కీచులాడుకుంటున్న పార్టీలను ఏకం చేయటంతోపాటు, రెండు దశాబ్దాల నుంచి దూరదూరంగా ఉంటున్న దాయాదులు ఠాక్రే సోదరుల్ని సైతం కలిపిన ఘనత ఈ ఎన్నికలదే. ఇంతవరకూ తనతో కలిసి నడిచిన ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌లు దూరం జరగటంతో గత్యంతరం లేని కాంగ్రెస్ ప్రకాశ్ అంబేద్కర్ నేతృత్వంలోని వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ)తో పొత్తు పెట్టుకుంది. 1998 నాటి లోక్‌సభ ఎన్నికల్లో తమ రెండు పార్టీలూ మహారాష్ట్రలో మెజారిటీ స్థానాలు గెల్చుకున్నాయని గుర్తుచేస్తోంది.

బీఎంసీ అనగానే కాంట్రాక్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, మహానగర పాలనాధికారం వగైరాలుంటాయి గనుక ఈ ఎన్నికల్లో విజేతగా ఆవిర్భవించే పార్టీ అదుపులో పుష్కలంగా నిధులు, దండిగా రాజకీయ పలుకుబడి, అస్మదీయులకు పంచి పెట్టేందుకు రకరకాల ప్రాజెక్టులు సిద్ధంగా ఉంటాయి. రాష్ట్రాన్నేలుతున్న బీజేపీ-షిండే శివసేన-అజిత్ పవార్ ఎన్సీపీలతో కూడిన మహాయుతి ఇప్పటికే బీఎంసీ తమ చేతి కొచ్చినంత ఆత్మవిశ్వాసంతో ఉంది. తమ రాజ్యాధికార శక్తి, సంస్థాగత నిర్మాణం అందుకు తోడ్పడగలవని భావిస్తున్నాయి. శివసేన పేరునూ, గుర్తునూ ఏక్‌నాథ్ షిండే కైంకర్యం చేయగా బలహీనపడిన ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన (యూబీటీ) గత్యంతరం లేక ఇరవయ్యేళ్ల క్రితం వేరుపడిన దాయాది రాజ్ ఠాక్రేకు సన్నిహితమై ఆయన పార్టీ మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్)తో పొత్తు పెట్టుకుంది.

మరిన్ని కనుగొనండిఎప్పటిలా ముంబైలో యూపీ, గుజరాత్, బిహార్‌ల నుంచి వలసొచ్చే వారితో మరాఠీలకు అన్యాయం జరుగుతున్నదంటూ ఆ సోదర ద్వయం నిప్పులు చెరుగుతోంది. త్రిభాషా సూత్రాన్ని మహాయుతి సర్కార్ ఆ మధ్య అమల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేయటం మరాఠీ ప్రజల్ని దెబ్బతీయటానికేనన్నది వారి అభియోగం. అయితే బీఎంసీ పరిధిలో మరాఠీ మాట్లాడే వారు 30 శాతం మించరు. 1960ల్లో శివసేన ఎదుగుదలకు తోడ్పడిన ప్రాంతీయత, అస్తిత్వవాదం ఇప్పుడేమాత్రం పనికొస్తాయన్నది పెద్ద ప్రశ్న. అందుకే కావొచ్చు... ఇళ్లల్లో పనిచేసే మహిళలకు నెలకు రూ. 1,500; 700 చదరపు అడుగుల వరకూ ఉండే ఇళ్లకు ఆస్తి పన్ను మినహాయింపు వగైరా హామీలిస్తున్నారు.ముంబైకి పెట్టుబడుల వరద పారించామంటూ ఎన్నికల ప్రచారం మొదలెట్టిన బీజేపీ ప్రత్యర్థుల దూకుడు చూసి పంథా మార్చుకుంది. నగరంలో 'బెస్ట్' బస్సుల్లో మహిళలకు 50 శాతం రాయితీ, వచ్చే అయిదేళ్లూ మున్సిపల్ చార్జీల పెంపుపై మారటోరియం, నిరుపేదలకు ఇళ్లు వగైరాలు మాట్లాడుతోంది. ఆ పార్టీ వలసొచ్చినవారి ప్రయోజనాలకే పాటుబడుతున్నదన్న అనుమానాలున్నా, మరాఠీ మధ్యతరగతి వర్గానికి దగ్గరయ్యామని బీజేపీ భావిస్తోంది. ఆ సంగతలా ఉంచి ఈ ఎన్నికల్లో కూడా ఉచితాలు వినబడటం ఆశ్చర్యం కలిగించే అంశం. ప్రభుత్వాలతో పోలిస్తే రుణ సేకరణకు పరిమితులుండే కార్పొరేషన్లలో ఇలాంటి రాయితీలు, వాగ్దానాలు ఆచరణ సాధ్యమేనా అని చూడటం లేదు.

**దేశంలో అన్ని కార్పొరేషన్ల మాదిరే బీఎంసీకి... ఆమాటకొస్తే దాంతోపాటే ఎన్నికలు జరగబోతున్న మహారాష్ట్రలోని మరో 28 కార్పొరేషన్లకూ ఎన్నో సమస్యలున్నాయి. ఉపాధి లేమి, ప్రాథమిక సదుపాయాల లేమి, అస్తవ్యస్త రహదారులు వగైరాలు అందులో కొన్ని. అయితే భావోద్వేగాలూ... లేకుంటే తాయిలాలూ తప్ప ఏ పార్టీ దగ్గరా భవిష్యత్తుకు పనికొచ్చే పథకాలున్నట్టు కనబడదు. దేశ ఆర్థిక రాజధానిగా ఉంటున్న ముంబై ఎటు మొగ్గినా దానికి పెద్దగా ఒరిగేదేమీ ఉండబోదని ఎన్నికల ప్రచారం తంతు చూస్తే అనిపిస్తుంది.**

# 80వ స్థానంతో.. మరింత బలపడ్డ భారత పాస్‌పోర్టు

న్యూఢిల్లీ: భారత పాస్‌పోర్టు బలపడింది. పాస్‌పోర్టుల ర్యాంకింగ్‌లో భారత్ స్థానం 85 నుంచి 80కి ఎగబాకింది. 55 దేశాల్లో వీసాలు లేకుండానే ప్రవేశించే వెసులుబాటు భారతీయులకు దక్కడంతో.. భారత్ పాస్‌పోర్టు బలపడింది. అదేసమయంలో పొరుగుదేశం పాకిస్థాన్ పరిస్థితి మరింతగా దిగజారిపోయింది. కింది నుంచి ఐదో స్థానం(పైనుంచి 98వ స్థానం) లో పాకిస్థాన్.. కింది నుంచి 8వ స్థానంలో బంగ్లాదేశ్ ఉండడం గమనార్హం..!

2025లో భారత పాస్‌పోర్టు ర్యాంకింగ్ 85గా ఉండేది. తాజాగా విడుదలైన ర్యాంకింగ్‌లో భారత్ 5 స్థానాలను ఎగబాకి.. 80కి చేరుకుంది. ముందస్తు వీసా లేకుండా.. ఆయా దేశాల్లోకి ప్రవేశించే వెసులుబాటు మేరకు ఈ ర్యాంకింగ్‌లను ఇస్తారు. ఈ కోవలో సింగపూర్ పాస్‌పోర్టు వరుసగా రెండోసారి టాప్‌లో నిలిచింది. 227 దేశాలకు గాను సింగపూర్ పౌరులు 192 దేశాలకు వీసా లేకుండా ప్రవేశించగలుగుతారు. దీంతో ఆ దేశ పాస్‌పోర్టు అత్యంత శక్తిమంతంగా మారింది.

రెండోస్థానంలో జపాన్, దక్షిణ కొరియా సంయుక్తంగా నిలిచాయి. ఈ దేశాల పౌరులు ఎలాంటి వీసాలు లేకుండానే 188 దేశాలకు ప్రయాణించగలుగుతున్నారు. డెన్మార్క్, లక్సెంబర్గ్, స్పెయిన్, స్వీడన్, స్విట్జర్లాండ్ రాష్ట్రాలు 186 దేశాల్లో ఉచిత వీసా ప్రవేశంతో మూడో స్థానంలో నిలిచాయి. అన్నింటికంటే.. ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్టు 101వ ర్యాంకుతో అత్యంత బలహీనంగా ఉంది.




# జర్నలిస్టుల రిమాండ్ రిజెక్ట్ చేసిన మేజిస్ట్రేట్



హైదరాబాద్‌లోని ఎన్‌టీవీ ఛానల్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టులు దొంతు రమేష్ (ఇన్‌పుట్ ఎడిటర్), సుధీర్ (రిపోర్టర్)ల రిమాండ్‌ను మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. ఇటీవల ఒక మహిళా ఐఏఎస్ అధికారిణి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మధ్య సంబంధం ఉందని ప్రసారమైన వార్తను "పరువు నష్టం"గా పేర్కొంటూ పలువురు జర్నలిస్టులను తెలంగాణ పోలీసులు నేడు అరెస్టు చేశారు. దొంతు రమేష్‌ను హైదరాబాద్ విమానాశ్రయంలో బ్యాంకాక్ వెళ్లేందుకు ఎదురు చూస్తుండగా.., సుధీర్‌ను ఆయన ఇంటి వద్ద మంగళవారం తెల్లవారు జామున అదుపులోకి తీసుకున్నారు. అయితే జర్నలిస్టులను అరెస్టులు చేయడం రాష్ట్రంలో పెద్ద దుమారం రేపింది.నేడు వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్ కోరగా... ప్రాథమిక ఆధారాలు సరిపోవడం లేదని, అరెస్టు ప్రక్రియలో నోటీసు ఇవ్వకపోవడం వంటి లోపాలు ఉన్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఇది ప్రెస్ స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యగా మారుతుందని పేర్కొంటూ రిమాండ్‌ను తిరస్కరించి, బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించింది. ఈ ఘటనలో బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ నేతలు, జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా స్పందించగా.. పోలీసు అధికారులు మాత్రం తమ చర్య చట్టబద్ధమేనని తెలిపారు. ఈ వ్యవహారం తెలంగాణలో మీడియా స్వేచ్ఛపై పెద్ద చర్చకు దారితీసింది.

# వీధివీధి తిరగాలి.. విజయబావుటా ఎగరాలి



80 నుంచి 90 శాతం మున్సిపాలిటీల్లో నెగ్గేందుకు అన్నిస్థాయిల్లోని నేతలు కార్యకర్తలతో కలసి పనిచేయాలని స్పష్టం చేసింది. జిల్లాకొక బహిరంగ సభను పెద్దయెత్తున నిర్వహించబోతున్నందున దాని పరిధిలోని మున్సిపాలిటీల నుంచి ఓటర్లను తరలించేందుకు కసరత్తు చేస్తోంది. ఎన్నికల్లో విజయానికి వీధివీధినా ప్రచారం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించినందున శ్రేణులంతా దాన్ని పాటించాలని పీసీసీ సూచించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఓటర్లకు వివరించాలని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దిశానిర్దేశం చేసినట్లు నేతలు చెప్పారు.

రెబెల్స్‌ను బుజ్జగించేందుకు..

పంచాయతీ ఎన్నికల్లో రెబెల్స్ కారణంగా కొన్నిచోట్ల ప్రతిపక్షాలు లాభపడ్డాయని.. మున్సిపాలిటీల్లో అది పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సీనియర్ నాయకులు చెప్పారు. ప్రధానంగా స్థానిక నేతల మధ్య అభిప్రాయభేదాలు ఇతర పార్టీలకు ఉపయోగపడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పీసీసీ గట్టి నిర్ణయం తీసుకుంది. ఏ మున్సిపాలిటీలో నేతల మధ్య సఖ్యత ఎలా ఉంది, ఎవరు ఎంతమంది అభ్యర్థులకు టిక్కెట్లు ఇవ్వాలని కోరుతున్నారనేది ముందే చెప్పాలని కోరింది. ఒక్కో వార్డుకు ఐదు నుంచి ఆరుగురు ఆశావహులను ఎంపిక చేసి పేర్లు పంపాలని నేతలకు సూచించింది. కానీ వీరిలో ఒకరికి టిక్కెట్ ఇస్తే మిగిలినవారు రెబెల్స్‌గా బరిలోకి దిగి పార్టీని నష్టపరచకుండా.. ముందే వారిని ఒకతాటిపైకి తీసుకురావాలని నిర్ణయించింది. ఆశావహుల పేర్లను సూచించే సమయంలోనే వారిలో ఎవరైనా ఒకరిపై ఇతరుల్లో తీవ్ర వ్యతిరేకత ఉందా అనేది పరిశీలించనున్నారు. పరస్పరం వ్యతిరేకించేవారిలో ఒకరికి టిక్కెట్ ఇస్తే అసంతృప్తికి గురయ్యేవారిని బుజ్జగించి రెబెల్‌గా బరిలోకి దిగకుండా చూడటంతోపాటు, వారిని ప్రచారానికి తీసుకెళ్లే బాధ్యతలను సైతం జిల్లా ముఖ్యనేతలే తీసుకోవాలని పీసీసీ సూచించినట్లు తెలుస్తోంది.

# కాళేశ్వరం మూడో టీఎంసీ పనులు వినియోగించుకుందాం

ఈకబురు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా మూడో టీఎంసీ కోసం చేపట్టిన పనులను వినియోగించుకోవడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. గోదావరి నుంచి మేడిగడ్డ ద్వారా మిడ్‌మానేరు వరకు మొదట రోజుకు రెండు టీఎంసీల నీటిని తరలించేలా గత ప్రభుత్వం నిర్మాణాలు చేసింది. తదుపరి మరో టీఎంసీ కూడా తరలించేలా పనులు చేపట్టింది. మూడో టీఎంసీకి దాదాపు రూ.34 వేల కోట్ల అంచనాలతో నిర్మాణాలు చేపట్టగా.. సుమారు రూ.18,000 కోట్ల పనులు పూర్తయ్యాయి. ప్రాణహితచేవెళ్ల ఎత్తిపోతల పథకంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పనులను.. ప్రస్తుతం తిరిగి వినియోగంలోకి తేవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్లకు ఎత్తిపోయడానికి ప్రభుత్వం డీపీఆర్ రూపకల్పనకు ఉత్తర్వులు జారీచేసింది. అయితే సుందిళ్లకు వచ్చే ఈ జలాలను ఎల్లంపల్లి, మధ్యమానేరు ద్వారా మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు వేగంగా తరలించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఈ క్రమంలో గతంలో చేపట్టిన మూడో టీఎంసీ పనులను వినియోగంలోకి తేవాలని ఆలోచన చేస్తోంది. ఇప్పటికే చేసిన ఖర్చు ఎంత? పూర్తిస్థాయిలో పనులు అందుబాటులోకి రావాలంటే ఇంకా ఎంత ఖర్చు పెట్టాలి? అనే దానిపై పూర్తిస్థాయి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా నీటి పారుదల శాఖను ఆదేశించినట్లు తెలిసింది.

రాజధాని అవసరాలు తీర్చేలా..

హైదరాబాద్ నగరం విస్తరిస్తుండగా.. పారిశ్రామిక, తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం భవిష్యత్తు ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే మల్లన్నసాగర్ నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లకు నీటిని తరలించేందుకు పనులు చేపడుతున్నారు. దీంతోపాటు హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న మల్లన్నసాగర్‌లో పెద్దఎత్తున నీటి నిల్వకు అవకాశం ఉండడంతో దాన్ని ఎందుకు వినియోగించుకోవద్దనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్లకు.. అక్కడి నుంచి మల్లన్నసాగర్‌కు నీటిని సరఫరా చేసి.. భవిష్యత్తు అవసరాలకు నీటి నిల్వలు ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని భావిస్తోంది. హైదరాబాద్ నగరానికి పవర్ గ్రిడ్ మాదిరి.. వాటర్ గ్రిడ్ ఒకటి ఉంటే బాగుంటుందని సీఎం సూచించినట్లు తెలిసింది. మూడో టీఎంసీ పనులు.. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ జలాశయాల్లో నీటినిల్వకు ఉన్న అవకాశాలు.. హైదరాబాద్‌కు ఆ నీటి తరలింపు.. వీటన్నింటిపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి.. నీటిపారుదలశాఖను ఆదేశించినట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా వాటర్ గ్రిడ్‌కు సంబంధించి ప్రతిపాదనలతో రావాలని నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాను సీఎం ఆదేశించినట్లు తెలిసింది.

పునరుద్ధరణ సరిగా చేయకుంటే ప్రభుత్వానికి తలపోటు

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులు చక్కగా చేయకుంటే.. ప్రభుత్వానికి తలనొప్పి వచ్చే అవకాశాలు ఉంటాయని సీఎం అభిప్రాయపడినట్లు తెలిసింది. భారాస ప్రభుత్వంలో 2023లో కుంగుబాటు, ఇతర లోపాలతో బయటపడ్డ 3 బ్యారేజీలను జాగ్రత్తగా వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నట్లు సమాచారం. బ్యారేజీల పునరుద్ధరణకు ఆసక్తి వ్యక్తీకరణ పద్ధతి ద్వారా డిజైనర్ సంస్థను నీటిపారుదల శాఖ ఎంపిక చేస్తోంది. ఈ విషయంలో జాగ్రత్త వహించాలని, డిజైన్లను కేంద్ర జల సంఘానికి పంపించి.. పక్కాగా నిర్ధారించుకున్నాకే పనులు చేపట్టాలని సూచించినట్లు సమాచారం. లేదంటే లోపాల కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చ వచ్చే అవకాశాలు ఉంటాయని హెచ్చరించినట్లు తెలిసింది.

# డిస్కంల నెత్తిన రూ.142 కోట్ల సర్‌ఛార్జి కత్తి!

హైదరాబాద్: కరెంటు కొనుగోలు బిల్లులను నిర్దేశిత గడువులోగా చెల్లించలేక రాష్ట్రంలో ఉత్తర, దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు సతమతమవుతున్నాయి. బకాయిలు సత్వరం చెల్లించకుంటే రూ.142 కోట్ల 'ఆలస్య రుసుం' (సర్‌ఛార్జి) పడే అవకాశం ఉండడంతో కొత్తగా రుణాలు సేకరించి చెల్లించాలని నిర్ణయించాయి. బ్యాంకుల్లో 'నగదు అప్పు పరిమితి' (సీసీఎల్) పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ పూచీకత్తు సమర్పించాలనే షరతుతో ఉత్తర డిస్కం.. సీసీఎల్‌ను ప్రస్తుతమున్న రూ.1,150 కోట్ల నుంచి రూ.2,150 కోట్లకు పెంచేందుకు ప్రధాన ప్రభుత్వ వాణిజ్య బ్యాంకు తాజాగా అంగీకారం తెలిపింది. ఇదే డిస్కం.. రాష్ట్ర ప్రభుత్వ పూచీకత్తు అవసరం లేకుండానే మరో వెయ్యి కోట్ల రుణాన్ని 9 శాతం వడ్డీతో తీసుకునేందుకు ప్రయత్నిస్తోంది.

దక్షిణ డిస్కం కూడా 'జాతీయ గ్రామీణ విద్యుదీకరణ సంస్థ' (ఆర్ఈసీ) నుంచి రూ.1500 కోట్ల రుణాన్ని 8.45 శాతం వడ్డీకి తీసుకుంటోంది. కరెంటు కొనుగోలు బిల్లుల చెల్లింపునకు మాత్రమే వినియోగించాలనే షరతుతోనే ఆర్ఈసీ ఈ రుణం ఇస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

ఎందుకీ జరిమానాలు...

విద్యుత్ ఉత్పత్తి సంస్థలు బిల్లు జారీచేసిన 75 రోజుల్లోపు.. డిస్కంలు చెల్లించాలి. ఈమేరకు కేంద్రం జాతీయస్థాయిలో 'ప్రాప్తి' పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఆ గడువు దాటితే సర్‌ఛార్జి పడుతుంది. ఎన్టీపీసీ, ప్రైవేటు విద్యుత్కేంద్రాలకు చెల్లింపుల్లో జాప్యంతో రూ.142 కోట్ల సర్‌ఛార్జి భారం పడనుంది. జెన్‌కో, సింగరేణి ప్లాంట్లకు.. డిస్కంలు ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించడం లేదు. గత సెప్టెంబరు, అక్టోబరులో కొన్న కరెంటుకు డిస్కంలు రూ.2,600 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. వచ్చే మార్చి వరకు ఆదాయ వ్యయాల లోటు పూడ్చడానికి మరో రూ.2,780 కోట్లు అవసరమని అంచనా. సర్‌ఛార్జి భారంతో మోయడం కంటే రుణాలు తీసుకోవడమే మేలని డిస్కంలు చెబుతున్నాయి.



## సహోద్యోగిగా మారుతున్న ఏఐ




**సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. ప్రస్తుతం టెక్ సంస్థల్లో దాదాపు 40% పనులు ఏఐ నిర్వహిస్తున్నట్లు పరిశ్రమ సంఘం నాస్కామ్, ఇండీడ్ సంయుక్తంగా నిర్వహించిన 'వర్క్ రీ-ఇమాజిన్డ్- ది రైస్ ఆఫ్ హ్యూమన్-ఏఐ కొలాబరేషన్' సర్వే తెలిపింది. 2027 నాటికి నిపుణులు, ఏఐ కలిసి పనిచేసే వాతావరణాన్ని 97% మంది మానవ వనరుల విభాగాధిపతులు ఊహిస్తున్నారు. ఆటోమేషన్ పెరుగుతున్నా, నాణ్యత కాపాడేందుకు మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని ఈ నివేదిక స్పష్టం చేసింది.**

ఏఐ ఒకప్పుడు బ్యాక్ఆఫీస్ కార్యకలాపాలకే పరిమితం అయ్యేది. ఇప్పుడు టెక్ సంస్థల్లో ఒక సహోద్యోగిగా మారిపోయింది అని నివేదిక పేర్కొంది. వివిధ విభాగాల్లో 2040% పనులను ఏఐ నిర్వహిస్తోంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఏఐని కేవలం సహాయం చేసేదిగా కాకుండా, రోజువారీ నిర్ణయాల్లో భాగంగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో ఏఐతో కలిసి పని చేసేలా ఉద్యోగులను సిద్ధం చేయడమే ప్రత్యామ్నాయమని నాస్కామ్ పరిశోధనా విభాగం అధిపతి కేతకీ కర్ణిక్ పేర్కొన్నారు.



**నాణ్యతపై ఆందోళన**

యాంత్రికీకరణ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, ఏఐ ఇచ్చే ఫలితాల నాణ్యతపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో, సగంకంటే ఎక్కువ మంది ఏఐ రూపొందించిన పనుల్లో అసంపూర్ణత లేదా తక్కువ నాణ్యత ఉన్నట్లు గుర్తించారు. ఏఐ చేసే పనుల్లో కచ్చితత్వం, సమగ్రత కాపాడేందుకు మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని నివేదిక తేల్చింది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో 45 శాతం పనులు ఏఐ ద్వారా జరుగుతుండగా, ఇంటెలిజెంట్ ఆటోమేషన్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ వంటివి తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

**నైపుణ్యాల తీరు మారుతోంది**

'కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాల సంఖ్య తగ్గుతోంది' అనేకంటే.. ఉద్యోగుల నుంచి సంస్థలు ఆశిస్తున్న పనితీరు మారుతోంది అని చెప్పొచ్చని ఇండీడ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శశి కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సంస్థలు, ఉద్యోగాల్లోకి వస్తున్నవారూ ఏఐతో కలిసి పనిచేసే వాతావరణానికి అలవాటు పడాల్సి ఉంటుందన్నారు. నియామక ప్రక్రియలోనూ మార్పులు వస్తున్నాయి. హైరింగ్ మేనేజర్లలో 85% మంది నైపుణ్యం ఆధారిత నియామకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. బహుళ నైపుణ్యాలున్న అభ్యర్థుల కోసం చూస్తున్నారు.

**ఏజెంట్లతో సవాళ్లు**

టెక్ రంగంలో ఏఐ ఏజెంట్లను విరివిగా వాడుతున్నారు. దాదాపు 95% సంస్థలు ఇప్పుడు వీటిని ఏదో ఒక రకంగా వినియోగిస్తున్నాయని, ఉపయోగించాలనే ఆలోచనలో ఉన్నాయని నివేదిక పేర్కొంది. డేటా ఆధారిత పనుల్లో ఇవి మనుషుల కంటే మెరుగ్గా పని చేస్తాయని 65% మంది నమ్ముతున్నారు. అయితే కొన్ని చిక్కు సమస్యలూ ఉన్నాయి. 77% మంది భద్రత, గోప్యత అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత సాఫ్ట్‌వేర్ వ్యవస్థలతో ఏఐని అనుసంధానించడం, నైతిక విలువలు, మార్పు వల్ల ఉద్యోగుల ప్రతిఘటనల వంటి సవాళ్లు వస్తున్నాయని నివేదిక తెలిపింది. ఏఐతో కలిసి పనిచేసేందుకు ఉద్యోగుల సంసిద్ధతపై 40% పైగా హెచ్ఆర్ అధిపతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని నివేదిక పేర్కొంది.

## సరికొత్త గరిష్ఠాలకు బంగారం, వెండి ధరలు.. కారణమేంటి?

**భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలతో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఎన్నడూలేని రీతిలో సరికొత్త రికార్డులను నెలకొల్పుతూ దూసుకెళుతున్నాయి. ఫ్యూచర్ మార్కెట్‌లో కిలో వెండి ధర మార్చి డెలివరీ కాంట్రాక్ట్ ఒక్క రోజులోనే రూ.12,803 పెరిగి రూ.2.87 లక్షలకు చేరింది. బంగారం సైతం 10 గ్రాములు రూ.1.43 లక్షల వద్ద ట్రేడవుతోంది. గత నాలుగు రోజుల్లోనే వెండి ధర రూ.35 వేలు మేర పెరిగింది. ఈ ఏడాదిలో (2026) ఇప్పటివరకు రూ.52 వేలు పెరగడం గమనార్హం. గతేడాది డిసెంబర్ 31 నాటికి రూ.2.35 లక్షలుగా ఉంది.**




ఇక బంగారం సైతం ఫ్యూచర్ మార్కెట్‌లో ఫిబ్రవరి కాంట్రాక్ట్ ఒక్క రోజులో రూ.932 పెరిగి రూ.1.43 లక్షల వద్ద సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో (స్పాట్ గోల్డ్) 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,600 పలుకుతుండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,31,650గా ఉంది. కిలో వెండి ధర రూ.2,88,300 ఉందని బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ విపణిలో ప్రస్తుతం బంగారం ఔన్సు 4,638.75 వద్ద ట్రేడవుతుండగా, వెండి 90 డాలర్ల ఎగువన కొనసాగుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.20గా ఉంది. రూపాయి విలువ క్షీణత కూడా దేశీయ బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతోంది.

కారణాలు ఇవీ..

తాజాగా విడుదలైన అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లు తగ్గించొచ్చన్న అంచనాలను పెంచాయని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలంత్రి పేర్కొన్నారు. ఈ అంచనాలు బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణమయ్యాయని తెలిపారు. కమొడిటీ ఎక్స్ఛేంజీలో వెండి ఔన్సు తొలిసారి 91 డాలర్ల మార్కును చేరుకుందన్నారు. దీనికితోడు భౌగోళిక ఉద్రిక్తతలు కూడా మరో కారణమని తెలిపారు. ఇరాన్‌లోని పౌరుల ఆందోళనలు, ఉక్రెయిన్ రష్యా మధ్య కొనసాగుతున్న దాడుల కారణంగా సురక్షిత పెట్టుబడి సాధనాలుగా భావించి బంగారం, వెండిపై పెట్టుబడులు కుమ్మరిస్తుండడంతో వీటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.



## భారత్‌పై ఇరాన్ ప్రభావం ఎంత?



**ఇరాన్‌తో వ్యాపారం నిర్వహిస్తున్న దేశాల ఉత్పత్తులపై 25% సుంకం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అంటే ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలున్న దేశం నుంచి, వస్తువులను అమెరికాకు ఎగుమతి చేస్తే అదనంగా 25% టారిఫ్‌ను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రస్తుతం ఇరాన్‌కు భారత్, చైనా, యూఏఈ ప్రధాన వాణిజ్య భాగస్వాములుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మనదేశ ఎగుమతులపై 'ఇరాన్' వల్ల పడే ప్రభావం ఎంత ఉండొచ్చంటే..**

ద్వైపాక్షిక వాణిజ్యం రూ.15,000 కోట్లే: గత ఆర్థిక సంవత్సరం (202425)లో ఇరాన్‌తో భారత్ జరిపిన మొత్తం వాణిజ్యం విలువ 1.68 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.15,120 కోట్లు) మాత్రమే. అందులోనూ వ్యవసాయ ఉత్పత్తుల వాటాయే 1.24 బిలియన్ డాలర్లు (సుమారు రూ.11,160 కోట్లు). తృణ ధాన్యాలు, టీ, కాఫీ, సుగంధ ద్రవ్యాలు, పళ్లు, కూరగాయలు, మందులు, ఎలక్ట్రికల్ మెషినరీ, కృత్రిమ ఆభరణాలు వంటివి ఇరాన్‌కు భారత్ ఎక్కువగా ఎగుమతి చేస్తుంటుంది. డ్రైఫ్రూట్స్, ఇనార్గానిక్/ఆర్గానిక్ కెమికల్స్, గ్లాస్‌వేర్ వంటివి దిగుమతి చేసుకుంటున్నాం.

ఆంక్షలకు వెలుపలే ఎగుమతులు: ప్రస్తుతం ఇరాన్‌కు మనదేశం ఆహారం, ఔషధాలు మాత్రమే పంపుతోంది. ఇరాన్‌పై ఆఫీస్ ఆఫ్ ఫారెన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసీ) ఆంక్షలకు సంబంధించిన నిబంధనలను భారతీయ కంపెనీలు, బ్యాంకులు పూర్తిగా పాటిస్తున్నాయని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఫియో) తెలిపింది. మానవతా దృక్పథంతో చేస్తున్న ఆహారం, మందుల వంటి వస్తువుల వాణిజ్యమే చేస్తున్నట్లు తెలిపింది. కాబట్టి తాజా ఆంక్షల ప్రభావం భారత్‌పై ఉండబోదని ఫియో డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ అంటున్నారు.

ఇది కీలకం: సిస్తాన్‌బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఉన్న చబహార్ పోర్టును భారత్‌ఇరాన్ సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్నాయి. ఇది ఇరు దేశాల వాణిజ్య సంబంధాలకు కీలకమైనది. ఇరాన్‌కు భారత వస్తువుల ఎగుమతులు 1.55% పెరిగి 1.24 బి.డాలర్లకు చేరగా, దిగుమతులు 29.32% తగ్గి 441.83 మి.డాలర్లకు పరిమితం అయ్యాయి.

**దేశీయంగా బాస్మతీ ధరలు కిందకు: ఇరాన్‌లో ఆందోళనలు కాస్తా భారత బాస్మతీ బియ్యం ఎగుమతులపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో దేశీయంగా వీటి ధర తగ్గుతోంది. అనిశ్చితుల కారణంగా ఎగుమతులకు సంబంధించిన చెల్లింపుల్లో ఆలస్యం ఇందుకు నేపథ్యమని భారతీయ బియ్యం ఎగుమతిదార్ల సమాఖ్య (ఐఆర్ఈఎఫ్) పేర్కొంటోంది. 2025-26 ఏప్రిల్-నవంబరులో 5.99 లక్షల టన్నుల బాస్మతీ బియ్యాన్ని ఇరాన్‌కు మనదేశం ఎగుమతి చేసింది. దేశీయంగా 1121 రకానికి చెందిన బియ్యం ధర గత వారంలోనే కిలోకు రూ.85 నుంచి రూ.80కి తగ్గింది. 1509, 1718 రకాల ధరలు రూ.70 నుంచి రూ.65కు దిగివచ్చాయి.**

## ఎస్‌బీఐ ఏటీఎం ఛార్జీల పెంపు




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏటీఎం, ఆటోమేటెడ్ డిపాజిట్-కమ్-విత్‌డ్రాయల్ మెషిన్ (ఏడీడబ్ల్యూఎం) లావాదేవీలపై వసూలు చేసే ఛార్జీలను సవరించింది. ఇతర బ్యాంకుల ఏటీఎంలను ఉచిత పరిమితిని మించి ఉపయోగించే కస్టమర్లపై ఫీజులు పెరిగాయి. ఈ సవరించిన ఛార్జీలు 2025 డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి.

ఉచిత లావాదేవీల పరిమితి పూర్తయిన తర్వాత, ఎస్‌బీఐ కస్టమర్లు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో నగదు ఉపసంహరణ చేస్తే ఒక్కో లావాదేవీకి రూ.23 + జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్ వంటి ఆర్థికేతర లావాదేవీలపై ఫీజును రూ.11 + జీఎస్టీగా నిర్ణయించారు. ఇంటర్‌చేంజ్ ఫీజు పెరుగుదల నేపథ్యంలో ఏటీఎం సేవల ధరలను సమీక్షించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్‌బీఐ తెలిపింది.

**ప్రభావం వీరిపైనే..**

ఉచిత లావాదేవీ పరిమితిని మించి ఎస్‌బీఐయేతర ఏటీఎంలను ఉపయోగించే సేవింగ్స్, శాలరీ ఖాతాదారులపై ఈ మార్పులు ప్రధానంగా ప్రభావం చూపుతాయి. అయితే, పలు ఇతర కేటగిరీల అకౌంట్లకు ఈ సవరణల నుంచి మినహాయింపును ఎస్‌బీఐ ఇచ్చింది.

**ఉచిత లావాదేవీల పరిమితులు**

రెగ్యులర్ సేవింగ్స్ ఖాతాదారులకు నెలకు ఐదు ఉచిత లావాదేవీలు (ఆర్థిక, ఆర్థికేతర కలిపి) యథాతథంగా కొనసాగుతాయి. ఈ పరిమితిని దాటిన తర్వాత సవరించిన ఛార్జీలు వర్తిస్తాయి. ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ సేవింగ్స్ బ్యాంక్ ఖాతాదారులకు ఇకపై అన్ని ప్రదేశాల్లోని ఇతర బ్యాంకుల ఏటీఎంలలో నెలకు 10 ఉచిత లావాదేవీలు మాత్రమే అనుమతిస్తారు. గతంలో వీరికి అపరిమిత ఉచిత లావాదేవీలు ఉండేవి.

**ప్రభావం లేని ఖాతాలివే..**

ఈ సవరణల వల్ల కింది ఖాతాదారులకు ఎలాంటి మార్పు ఉండదని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (బీఎస్‌బీడీ) ఖాతాలు – ప్రస్తుత ఛార్జ్ నిర్మాణమే కొనసాగుతుంది. ఎస్‌బీఐ డెబిట్ కార్డు ద్వారా ఎస్‌బీఐ ఏటీఎంలలో చేసే లావాదేవీలు పూర్తిగా ఉచితం. ఎస్‌బీఐ ఏటీఎంలలో కార్డు రహిత నగదు ఉపసంహరణలు అపరిమితంగా, ఉచితంగా కొనసాగుతాయి. కిసాన్ క్రెడిట్ కార్డు (కేకేసీ) ఖాతాలకు కూడా ఈ ఛార్జీల నుంచి మినహాయింపు ఉంటుంది.


## '10 మినిట్స్ డెలివరీ' తొలగించిన స్విగ్గీ, జెప్టో

క్విక్ కామర్స్ సంస్థలైన స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో '10 మినిట్స్ డెలివరీ' (10 mins Delivery) బ్రాండింగ్‌ను నిలిపివేశాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్లింకిట్ మంగళవారం తొలుత ఈ నిర్ణయం తీసుకోగా.. బుధవారం ఈ రెండు సంస్థలూ '10 నిమిషాల్లో డెలివరీ' ప్రకటనను ఆపివేశాయి. త్వరితగతిన డెలివరీ పేరుతో డెలివరీ ఏజెంట్లపై ఒత్తిడి తెస్తున్నారంటూ గిగ్ వర్కర్ల నుంచి ఇటీవల ఆందోళనలు వ్యక్తమైన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ.. బ్లింకిట్, జెప్టో, జొమాటో, స్విగ్గీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. డెలివరీ కార్మికుల సంక్షేమం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇటువంటి హామీ ఇవ్వొద్దని ఆయా సంస్థలకు స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో '10 నిమిషాల డెలివరీ' ప్రకటనను తొలగింపునకు కంపెనీలు చర్యలు చేపట్టాయి. అయితే, బ్రాండింగ్ మారుతుందే తప్ప.. కస్టమర్లకు క్విక్ డెలివరీలు మాత్రం ఎప్పటిలానే కొనసాగుతాయి. 10 నిమిషాల నిబంధన తొలగించడం వల్ల డెలివరీ ఏజెంట్లపై ఆ మేర ఒత్తిడి తగ్గుతుంది. గిగ్‌కార్మికుల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్ స్వాగతించింది.




## మొబైల్ ఫోన్ల తయారీ @ 75 బిలియన్ డాలర్లు



మొబైల్ ఫోన్లకు తయారీ ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) దన్నుతో దేశీయంగా మొబైల్ ఫోన్ల ఉత్పత్తి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) ఆఖరు నాటికి 75 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) అంచనా వేస్తోంది. ఇందులో ఎగుమతులు 30 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండొచ్చని భావిస్తోంది. ఐసీఈఏ ఛైర్మన్ పంకజ్ మహీంద్రూ ఈ విషయాలు వెల్లడించారు. 2026 మార్చితో పీఎల్ఐ స్కీము ముగియనుండటం పరిశ్రమకు మరో కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. వివిధ ప్రోడక్టుల విభాగాలవ్యాప్తంగా భారత్ తయారీ సామర్థ్యాలను బట్టి తదుపరి దశ వృద్ధి ఆధారపడి ఉంటుందని మహీంద్రూ చెప్పారు. మరోవైపు, భారత్ దాదాపు 30 కోట్ల యూనిట్ల మొబైల్ ఫోన్ల ఉత్పత్తి స్థాయికి చేరుతుందని మార్కెట్ రీసెర్చ్, అనాలిసిస్ సంస్థ కౌంటర్‌పాయింట్ సహ వ్యవస్థాపకుడు నీల్ షా తెలిపారు. 2025లో భారత్‌లో తయారైన ప్రతి నాలుగు ఫోన్లలో ఒకటి ఎగుమతయ్యిందని చెప్పారు. టెక్ దిగ్గజం యాపిల్ కారణంగా అమెరికా మార్కెట్ ప్రీమియం ఉత్పత్తులకు అతి పెద్ద ఎగుమతుల మార్కెట్‌గా నిలిచిందని పేర్కొన్నారు. శాంసంగ్, మోటరోలా వల్ల కూడా గణనీయంగా విలువ చేసే ఎగుమతులు నమోదైనట్లు తెలిపారు.


## నలుగురు మాట్లాడుతుంటే... నలభైమంది చూస్తున్నారు!



''పాన్ ఇండియా స్టార్ అయిన ప్రభాస్‌తో ఓ సాదాసీదా హారర్ కామెడీ చేయకూడదనే... ఫాంటసీ, సైకలాజికల్ అంశాల్ని జోడించి ఓ భారీ స్థాయి చిత్రం చేశాం. మా ప్రయత్నం ప్రేక్షకులకు నచ్చడంతోనే భారీస్థాయిలో వసూళ్లు వస్తున్నాయి. సెలవుల్లో ఈ సినిమాకి మరింత ఆదరణ దక్కుతుందని ఆశిస్తున్నాం'' అన్నారు మారుతి. ఆయన దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటించిన చిత్రమే... 'ది రాజాసాబ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో ఇటీవలే విడుదలైన ఈ చిత్రం రూ.200 కోట్ల వసూళ్ల మైలురాయిని అధిగమించింది. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. 'సంక్రాంతి సెలవులు ప్రారంభానికి ముందే ఈ చిత్రం భారీ వసూళ్లు సొంతం చేసుకుంది. ఈ పండగ సెలవుల్లో ఇంకా భారీ వసూళ్లు సాధిస్తుందని ఆశిస్తున్నాం. సైకలాజికల్ అంశాలతో ఓ కొత్త అంశాన్ని తెరపై చూపించాం. మేం అనుకున్న కాన్సెప్ట్ తొలిసారి చూసినప్పుడు కొంతమందికి సులువుగా అర్థం కాకపోవచ్చు. కానీ ఇప్పుడు వాళ్లే సినిమా చాలా బాగుందని సందేశాలు పంపిస్తున్నారు. 'మనం ఓ కొత్త ప్రయత్నం చేశాం, ప్రేక్షకులకు చేరువ కావడానికి కొంత సమయం పడుతుంది. నువ్వు ప్రశాంతంగా ఉండు' అని ప్రభాస్ ముందుగానే నాతో అన్నారు. ఆయన చెప్పినట్టే జరిగింది. ప్రభాస్ కొత్త గెటప్‌కి సంబంధించిన సన్నివేశాల్ని జోడించాక సన్నివేశాలన్నీ పక్కాగా కుదిరాయని అంటున్నారంతా. ప్రభాస్‌కి సందేశం పంపితే ఆయన కూడా అదే మాట చెప్పారు. ప్రభాస్‌ని కలర్‌ఫుల్ పాటలు, డ్యాన్సులతో తెరపై చూపించారని చాలామంది అభిమానులు చెప్పారు. పరిశ్రమ నుంచి కూడా నాకు చాలా మంది వ్యక్తిగతంగా ఫోన్ చేసి చెప్పారు''.

''ఫాంటసీతో కూడిన 'ది రాజాసాబ్' తరహా సినిమా చేయడం అంత సులువు కాదు. హిప్నాటిజం నేపథ్యాన్ని విజువల్‌గా చూపించడం చాలా కష్టం. ప్రభాస్ వృద్ధుడిగా కనిపిస్తూ, రివర్స్‌లో సాగే సన్నివేశాల కోసం చాలా కష్టపడ్డాం. కొన్ని సన్నివేశాల్ని ఎలా చేద్దామని ప్రభాస్ ఎంతగానో ఆలోచించి తన ఆలోచనల్నీ పంచుకుంటూ సినిమాలో నటించారు. ఇంత భారీగా వసూళ్లు వస్తున్నాయంటే ప్రభాస్‌ని ఓ కొత్త జానర్‌లో ప్రేక్షకులు స్వీకరించినట్టే కదా! అనుకున్న సమయానికి సినిమాని విడుదల చేయాలనే ఒత్తిడిలో, రాత్రింబవళ్లూ పనిచేయడంతో విడుదలకు ముందు కొంచెం అలిసిపోయినట్టు కనిపించా. కానీ సినిమా విడుదలైన రెండోరోజే మీడియా ముందుకొచ్చి మాట్లాడాను. ప్రతి సినిమాకీ సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ వస్తుంటాయి. కానీ నేను మొదట్నుంచీ నమ్మకంగానే ఉన్నా. 'ది రాజాసాబ్' గురించి నలుగురు చెడుగా మాట్లాడితే, నలభై మంది థియేటర్‌కి వెళ్లి సినిమాని చూస్తున్నారు. ఆ తర్వాత సినిమా బాగుంది కదా అంటున్నారు. చిన్న చిన్న పట్టణాల్లో కూడా థియేటర్లు నిండిపోతున్నాయి''. ''ఒక పెద్ద స్టార్‌తో కూడా సినిమాని బాగా చేయగలనని 'ది రాజాసాబ్'తో నిరూపించుకున్నా. 'ప్రతి రోజూ పండగే' సినిమాని 40 రోజుల్లో రాసిన నేను, ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాల కోసం రెండు నెలల సమయం తీసుకున్నా. విజువల్ ఎఫెక్ట్స్ విషయంలోనూ చాలా నేర్చుకున్నా. నాకు అన్ని రకాలుగా 'ది రాజాసాబ్' ఓ గొప్ప అనుభవాన్నిచ్చింది. ప్రస్తుతం నా ఆలోచనలనిండా ఈ సినిమానే ఉంది. అందుకే తదుపరి సినిమాపై ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదు. చిరంజీవికి అభిమానిని నేను. ఆయనతో సినిమా చేసే అవకాశం వస్తే మాత్రం అదెంతో ప్రత్యేకం అవుతుంది'



# అసలైన విజయం ఇదే

మరీ ఎక్కువగా ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా... నటిగా తొలి అడుగులు వేస్తున్న సమయంలోనే శ్రీలీల అగ్ర హీరోలతో కలిసి నటించే అవకాశాల్ని అందుకుంది. ఆ అవకాశాలకు తగ్గట్టుగానే ఆమె తన అందంతో ప్రేక్షకుల్ని ఆకర్షించింది. హుషారైన డ్యాన్స్‌తో కమర్షియల్ సినిమాలకు తగ్గ కథానాయిక అనిపించుకుంది. తెలుగు సినిమాల్లో ఆమెకు పాటలతోనే ఎక్కువగా పేరొచ్చింది. అయితే ఇప్పుడు తన నటనకీ గుర్తింపు లభించిందనే ఆనందంలో ఉంది ఈ అచ్చ తెలుగమ్మాయి. ఇటీవలే శ్రీలీల తమిళంలో 'పరాశక్తి' చిత్రంలో నటించింది. ఆ సినిమాకి అక్కడ మిశ్రమ స్పందన లభించినా, శ్రీలీల నటనకి మాత్రం మంచి పేరొచ్చింది. అదే విషయాన్నే ఆమె ఓ వేడుకలో ప్రస్తావిస్తూ... ఎప్పుడూ పాటలు, డ్యాన్సులతోనే తనని గుర్తించేవారని, అందుకు భిన్నంగా మొట్ట మొదటిసారి పూర్తిగా తన నటన గురించే మాట్లాడుతున్నారని అంది. ప్రేక్షకులు, పరిశ్రమ నుంచి ప్రశంసలు లభిస్తుండడం ప్రత్యేకమైన అనుభూతిని పంచుతోందని, అసలైన విజయం ఇప్పుడు దక్కిందనే భావనలో ఉన్నానని చెప్పుకొచ్చింది శ్రీలీల. తమిళంలో ఆమె చేసిన తొలి సినిమా ఇదే. త్వరలోనే హిందీలోకీ అడుగు పెట్టనుంది.

## బాహుబలి2' రికార్డును బద్దలు కొట్టిన 'ధురంధర్'.. ఓటీటీలో వచ్చేది అప్పుడేనా?




**రికార్డులు ఉన్నవే బద్దలు కొట్టడానికి అన్నట్లు 'ధురంధర్' (Dhurandhar) కలెక్షన్లు రాబడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ ఇప్పటి వరకూ రూ.1300 కోట్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ క్రమంలో మరో రికార్డును సైతం ఈ మూవీ తన ఖాతాలో వేసుకుంది. నార్త్ అమెరికాలో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా రికార్డు సృష్టించింది. ఇప్పటివరకూ ఈ రికార్డు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్, రానా నటించిన 'బాహుబలి2' పేరిట ఉండేది. ఈ మూవీ 20.7 మిలియన్ డాలర్లు వసూలు చేసింది. గత 9ఏళ్లుగా ఈ రికార్డును ఏ చిత్రమూ బ్రేక్ చేయలేక పోయింది. ఇప్పుడు 'ధురంధర్' 21 మిలియన్ డాలర్లతో 'బాహుబలి2' రికార్డును బద్దలు కొట్టింది.**

భారత్‌లో అత్యధిక వసూళ్లు రాబట్టిన హిందీ చిత్రంగానూ 'ధురంధర్' రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు యూఎస్‌లోనూ 21 మిలియన్ డాలర్లతో టాప్‌లోకి వచ్చింది. ఈ మూవీ తర్వాత 'బాహుబలి2' (20.7 మిలియన్ డాలర్లు), కల్కి: 2898ఏడీ (18.5 మిలియన్ డాలర్లు), పఠాన్ (17.5 మిలియన్ డాలర్లు), జవాన్ (15.6 మిలియన్ డాలర్లు) చిత్రాలు ఉన్నాయి. ఇక ఆస్ట్రేలియాలోనూ అత్యధిక వసూళ్లు రాబట్టిన భారతీయ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.

**ఓటీటీలో ఎప్పుడు?**

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో వరుసగా సంక్రాంతి సినిమాలు సందడి చేస్తుండటంతో 'ధురంధర్' హవా తగ్గింది. కానీ, ఉత్తరాదిలో ఇంకా ఈ సినిమా మంచి కలెక్షన్లు రాబడుతోంది. శుక్రవారం రూ.3.60 కోట్లు రాబట్టగా, శనివారం రూ.6.10 కోట్లు, ఆదివారం రూ.6.85కోట్లు, సోమవారం రూ.2.70కోట్లు, మంగళవారం రూ.2.90 కోట్లు వసూలు చేసింది. మొత్తంగా ఇండియన్ బాక్సాఫీస్ వద్ద రూ.863 కోట్లు (నెట్) రాబట్టినట్లు సినీ విశ్లేషకుడు తరుణ్ ఆదర్శ్ పేర్కొన్నారు. వచ్చే వారం 'బోర్డర్2' మూవీ విడుదల కానుంది. అప్పటివరకూ 'ధురంధర్' హవా కొనసాగే అవకాశం ఉంది. ఇక ఈ మూవీ ఓటీటీలో ఎప్పుడు వస్తుందా? అని సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జనవరి 30న (dhurandhar ott release date) నెట్‌ఫ్లిక్స్ వేదికగా 'ధురంధర్' స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. దీనిపై అటు చిత్ర బృందం.. ఇటు ఓటీటీ సంస్థ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

## పవన్ తో కలిసి టీజీ విశ్వప్రసాద్ సినిమాలు



భోగి శుభ దినాన ప్రముఖ నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మిలాఖత్ అయ్యారు. త్వరలో తమ కాంబినేషన్ లో రాబోతున్న ప్రాజెక్ట్స్ గురించి వారు చర్చించారు.

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ స్థాపించిన 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్', ప్రముఖ నిర్మాణ సంస్థ 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీ'తో చేతులు కలిపిన విషయం విదితమే. ఈ రెండు సంస్థలు కలిసి గొప్ప చిత్రాలను ప్రేక్షకులను అందించడానికి సిద్ధమవుతున్నాయి. గతంలోనే ఈ సంస్థల మధ్య కథలకు సంబంధించిన చర్చలు జరిగాయి. తాజాగా మరోసారి పవన్ కళ్యాణ్, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కలిసి రాబోయే ప్రాజెక్టులపై చర్చించారు.

పవన్ కళ్యాణ్, టీజీ విశ్వప్రసాద్ భేటీ గురించి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' స్పందిస్తూ.. 'భోగి శుభ సందర్భంగా కొత్త ఆరంభాల స్ఫూర్తిని సూచిస్తూ, రాబోయే ప్రాజెక్టులపై గతంలో జరిగిన చర్చలను కొనసాగిస్తూ, శ్రీ పవన్ కళ్యాణ్ గారు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ని కలిసి మరింత విస్తృతంగా చర్చించారు' అని తెలిపింది.

'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' ట్వీట్ కి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ బదులిస్తూ, 'కథలపై చర్చించడానికి మాకు అవకాశం కల్పించినందుకు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇది మాకు ఎంతో విలువైనది. ప్రేక్షకులకు బలమైన, అర్థవంతమైన, ప్రభావవంతమైన కంటెంట్‌ను అందించేందుకు 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్'తో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాము. ఈ కలయిక మాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ అద్భుత ప్రయాణం కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాం' అని తమ సంతోషాన్ని పంచుకున్నారు.

# అఫీషియల్.. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో అల్లు అర్జున్..

**అల్లు అర్జున్ (Allu Arjun) కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ (Lokesh Kanagaraj) దర్శకత్వంలో ఓ మూవీ రూపొందనుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. అనిరుధ్ రవిచంద్రన్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. ఈ ఏడాదే #AA23గా ఈ మూవీ చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం స్పెషల్ వీడియోను పంచుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బన్నీవాస్‌తో పాటు నట్టి, శాండీ, స్వాతి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.**

అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఓ చిత్రంలో (#AA22xA6) నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీలో దీపిక పదుకొణె, జాన్వీకపూర్ కథానాయికలు. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దీని తర్వాత బన్ని ఎవరి దర్శకత్వంలో చేస్తారా? అని ఆయన అభిమానులు ఎదురు చూశారు. పురాణాల నేపథ్యంగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ మూవీ ఉంటుందని కొన్ని రోజులు ప్రచారం జరిగింది. ఆ తర్వాత దాని గురించి ఎలాంటి అప్‌డేట్ లేదు.ఈ క్రమంలో లోకేశ్ కనగరాజ్ హైదరాబాద్ రావడం, అల్లు అర్జున్ ఇంటికి వెళ్లడం టాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయ్యాయి. ఎందుకంటే 'కూలీ' తర్వాత లోకేశ్ తన LCUలో(లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్) భాగంగా 'ఖైదీ2' (kaithi 2 movie) చేస్తారని అందరూ అనుకున్నారు. ఆయన కూడా ఇదే విషయాన్ని పలు వేదికలపై చెప్పారు. ఇప్పుడు అల్లు అర్జున్‌తో సినిమాను ప్రకటించడంతో ఆ ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టినట్లే. ఈ సినిమాకు సంబంధించి కథ ఇప్పటికే లాక్ అవ్వగా, స్క్రిప్ట్ వర్క్ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. అట్లీ మూవీ పూర్తవగానే కాస్త విరామం తీసుకుని అల్లు అర్జున్ #AA23 సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నారు. ఈ ఏడాది ద్వితీయార్ధంలో ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఓ సరికొత్త యాక్షన్ డ్రామాగా దీన్ని తీర్చిదిద్దుతారట. గత చిత్రాలకు పూర్తి భిన్నమైన క్యారెక్టరైజేషన్‌తో అల్లు అర్జున్ కనిపించనున్నారని సమాచారం. 'కూలీ' ఇచ్చిన ఫలితం ఎలా ఉన్నా, లోకేశ్ మేకింగ్‌పై నమ్మకంతోనే అల్లు అర్జున్ ఈ అవకాశమిచ్చినట్లు టాలీవుడ్ టాక్




## ఒక్క సీన్‌తో వైరల్.. 'టాక్సిక్' బ్యూటీ ఇన్‌స్టా డిలీట్

కన్నడ స్టార్ హీరో యశ్ కొత్త సినిమా టాక్సిక్ టీజర్ పాన్ ఇండియా రేంజ్‌లో హీట్ పెంచుతుంది. టీజర్‌లో ఉన్న ఇంటిమేట్ సీన్‌పై మహిళా సంఘాలు తీవ్రమైన అభ్యంతరం తెలిపాయి. యశ్‌తో పాటు బోల్డ్ సీన్‌లో కనిపించిన బీట్రీజ్ టోఫెన్ బాఖ్ (Beatriz Taufenbach) తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించింది. తన ఇంటిమేట్ సీన్స్‌పై వివాదాలు రావడం వల్లనే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీని దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే.

టాక్సిక్ టీజర్‌లో చాలా బోల్డ్‌గా నటించిన తర్వాత ఆమె గురించి తెలుసుకోవాలని నెటిజన్లు పోటీపడ్డారు. ఈ క్రమంలో దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఆమె వివరాలు షేర్ చేశారు. దీంతో ఆమె పేరు బీట్రీజ్ బాఖ్ అని పంచుకున్నారు. హాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు ఇదే ఫస్ట్ ఇండియన్ సినిమా... దీంతో ఆమెకు భారీగా ఫాలోవర్స్ పెరిగారు. జనవరి 13 వరకు ఆమె ఖాతా యాక్టివ్‌గానే ఉంది. కానీ, సెడెన్‌గా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఖాతా కనిపించకపోవడంతో నెటిజన్లు ఈ విషయాన్ని షేర్ చేస్తున్నారు.

# కోహ్లి నం.1




**మూడో స్థానానికి రోహిత్**

దుబాయ్: అద్భుత ఫామ్‌లో ఉన్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సుదీర్ఘ విరామం తర్వాత నంబర్‌వన్ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో అదరగొట్టిన అతడు రోహిత్‌ను వెనక్కి నెట్టి వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ ఘనత సాధించడం అయిదేళ్లలో అతడికి ఇదే తొలిసారి. చివరిగా కోహ్లి 2021 జులైలో నంబర్‌వన్ స్థానంలో ఉన్నాడు. మొత్తంగా ఈ స్థానంలో అతడు 825 రోజులు పూర్తి చేసుకున్నాడు. కెరీర్లో అగ్రస్థానం చేరుకోవడం అతడికి ఇది పదకొండోసారి. తాజా ర్యాంకింగ్స్‌లో టాప్3 బ్యాటర్ల మధ్య అంతరం పెద్దగా లేదు. కోహ్లి (785), రెండో స్థానంలోని డరిల్ మిచెల్ (784) మధ్య తేడా ఒక పాయింటే. రోహిత్ (775) టాప్ నుంచి మూడో స్థానానికి పడిపోయాడు. గత ఏడాది టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన 37 ఏళ్ల విరాట్.. ఇటీవల వన్డేల్లో నిలకడగా రాణిస్తున్నాడు. నిరుడు దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో వరుసగా 135, 102, 65 (నాటౌట్)తో అదరగొట్టాడు. తాజాగా న్యూజిలాండ్‌తో మొదటి వన్డేలో 91 బంతుల్లో 93 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. టీమ్‌ఇండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (5వ స్థానం) ర్యాంకులో ఎలాంటి మార్పు లేదు. వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (10) టాప్10లో చోటు దక్కించుకున్నాడు. బౌలర్ల ర్యాంకుల్లో కుల్‌దీప్ (3వ) తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సిరాజ్ ఒక ర్యాంకు మెరుగై 16వ స్థానానికి చేరుకున్నాడు. రషీద్ ఖాన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## నేటి నుంచే అండర్-19 ప్రపంచకప్..

# ఫేవరెట్‌గా భారత్

కుర్రాళ్ల సమరానికి వేళైంది. నేటి నుంచే అండర్ 19 ప్రపంచకప్. ఈ టోర్నీలో అదిరే రికార్డు భారత్ సొంతం. అయిదుసార్లు టైటిల్ చేజిక్కించుకుంది. ఇప్పుడూ భారీ అంచనాలతో పోరుకు సిద్ధమైంది. గురువారం అమెరికాతో మ్యాచ్‌తో మన కుర్రాళ్లు టైటిల్ వేటను ఆరంభించనున్నారు. మరి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోన్న భారత యువ జట్టు అంచనాలను నిలబెట్టుకుంటుందా.. దేశానికి ఆరో కప్పును అందిస్తుందా?

టీ20 ప్రపంచకప్‌నకు ముందు క్రికెట్ అభిమానులను అలరించడానికి మరో ఐసీసీ టోర్నీ సిద్ధమైంది. గురువారం అండర్19 వన్డే ప్రపంచకప్ ఆరంభం కానుంది. టోర్నీలో అత్యంత విజయవంతమైన జట్టయిన భారత్.. తొలి రోజు గ్రూప్‌బి మ్యాచ్‌లో అమెరికాతో తలపడుతుంది. ఆయుష్ మాత్రే సారథ్యంలోని భారత జట్టులో కుర్ర సంచలనం వైభవ్ సూర్యవంశీ కూడా ఉన్నాడు. మొదటి రోజు మరో రెండు మ్యాచ్‌లు కూడా జరగనున్నాయి. గ్రూప్‌సిలో స్కాట్లాండ్‌ను జింబాబ్వే, గ్రూప్‌డిలో టాంజానియాను వెస్టిండీస్ ఢీకొంటాయి.

**సమతూకంగా భారత్:** 1988లో ఆరంభమైన అండర్19 ప్రపంచకప్‌లో భారత జట్టు మొదటి నుంచీ ఆధిపత్యం ప్రదర్శిస్తూ వస్తోంది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ వంటి ఆటగాళ్లు ఈ టోర్నీతోనే వెలుగులోకి వచ్చారు. భారత జట్టు 2000, 2008, 2012, 2022, 2018లో టైటిళ్లు గెలుచుకుంది. 2024లో ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయంపాలైంది. గత 16 అండర్19 మ్యాచ్‌ల్లో 13 గెలిచిన భారత్.. ఈసారి ఎలాగైనా ప్రపంచకప్పు కొట్టాలనే పట్టుదలతో ఉంది. 16 మంది సభ్యుల జట్టు బలంగా, సమతూకంగా ఉంది. వైభవ్ సూర్యవంశీ, కెప్టెన్ ఆయుష్ మాత్రే, వైస్ కెప్టెన్ విహాన్ మల్హోత్రా, టాప్ ఆర్డర్ బ్యాటర్ ఆరోన్ జార్జ్, అభిజ్ఞాన్ కుందు వంటి ఆటగాళ్లపై ఎన్నో అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఇటీవల కాలంలో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడుతోన్న 14 ఏళ్ల వైభవ్ అందరినీ ఆకర్షిస్తున్నాడు. పేస్ బౌలింగ్‌లో దీపేశ్ దేవేంద్రన్ కీలకం కానున్నాడు. అంబ్రిశ్ కూడా మంచి వేగంతో బంతులేస్తాడు. బ్యాటుతోనూ రాణించగలడు. కిషన్ సింగ్, హెనిల్ పటేల్‌లు జట్టులోని ఇతర పేసర్లు. మరోవైపు అమెరికా జట్టుకు ఉత్కర్ష్ శ్రీవాత్సవ నాయకత్వం వహిస్తున్నాడు. ఆ జట్టు నుంచి భారత్‌కు పెద్దగా పోటీ ఉండకపోవచ్చు.

**16 జట్లు.. 4 గ్రూపులు..**

జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమిస్తోన్న ఈ ప్రపంచకప్‌లో 16 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూప్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిక్సెస్‌కు అర్హత సాధిస్తాయి. అక్కడి నుంచి ఒక్కో గ్రూప్ నుంచి రెండు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. అమెరికాతో మ్యాచ్ తర్వాత భారత్.. జనవరి 17న బంగ్లాదేశ్‌తో, జనవరి 24న న్యూజిలాండ్‌తో తలపడుతుంది.

**గ్రూప్-ఎ: ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జపాన్, శ్రీలంక**
**గ్రూప్-బి: భారత్, అమెరికా, బంగ్లాదేశ్, న్యూజిలాండ్**
**గ్రూప్-సి: ఇంగ్లాండ్, పాకిస్థాన్, స్కాట్లాండ్, జింబాబ్వే**
**గ్రూప్-డి: అఫ్గానిస్థాన్, దక్షిణాఫ్రికా, టాంజానియా, వెస్టిండీస్**

**భారత్ అండర్-19 జట్టు: ఆయుష్ మాత్రే (కెప్టెన్), అంబ్రిశ్, కనిష్క్ చౌహాన్, దీపేశ్, మహ్మద్ ఎనాన్, ఆరోన్ జార్జ్, అభిజ్ఞాన్ కుందు, కిషన్ కుమార్ సింగ్, విహాన్ మల్హోత్రా, ఉద్ధవ్ మోహన్, హెనిల్ పటేల్, ఖిలాన్, హర్వంశ్ సింగ్, వైభవ్ సూర్యవంశీ, వేదాంత్ త్రివేది.**



## ముగిసిన సింధు పోరాటం..



**దిల్లీ: ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధుకు చుక్కెదురైంది. భారీ అంచనాలతో బరిలో దిగిన తెలుగమ్మాయి తొలి రౌండ్లోనే నిష్క్రమించింది. బుధవారం మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో సింధు 22-20, 12-21, 15-21తో నుయెన్ లిన్ (వియత్నాం) చేతిలో పరాజయం చవిచూసింది. తన్వి శర్మ 20-22, 21-18, 13-21తో వాంగ్ యి (చైనా) చేతిలో పోరాడి ఓడింది. మాళవిక బాన్సోద్ 21-18, 21-19తో పాయ్ యు (చైనీస్ తైపీ)పై గెలిచి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. అగ్రశ్రేణి ఆటగాళ్లు కిదాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్.ప్రణయ్ శుభారంభం చేశారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో శ్రీకాంత్ 15-21, 21-6, 21-19తో తరుణ్ మన్నెపల్లిపై, ప్రణయ్ 22-20, 21-18తో లీ చుక్ (హాంకాంగ్)పై నెగ్గి ప్రిక్వార్టర్స్ చేరుకున్నారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ 15-21, 14-21తో పాకాపోన్- సప్సిరి (థాయ్‌లాండ్) జంట చేతిలో ఓడింది.**

## హైదరాబాద్ కెప్టెన్‌గా సిరాజ్



హైదరాబాద్: రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టుకు భారత పేసర్ మహ్మద్ సిరాజ్ సారథ్యం వహించనున్నాడు. ముంబయి, చత్తీస్‌గఢ్‌లతో జరిగే తర్వాతి రెండు రంజీ మ్యాచ్‌లకు సిరాజ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని బుధవారం హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) వెల్లడించింది. ఈమేరకు 15 మందితో కూడిన హైదరాబాద్ జట్టును సీనియర్ సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసింది.

హైదరాబాద్ జట్టు: సిరాజ్ (కెప్టెన్), రాహుల్ సింగ్ (వైస్ కెప్టెన్), సి.వి.మిలింద్, తనయ్ త్యాగరాజన్, రోహిత్ రాయుడు, హిమతేజ, వరుణ్‌గౌడ్, అభిరథ్‌రెడ్డి, రాహుల్ రాదేశ్ (వికెట్ కీపర్), అమన్‌రావు పేరాల, రక్షణ్‌రెడ్డి, నితిన్ సాయియాదవ్, నితేష్‌రెడ్డి, సాయి ప్రజ్ఞయ్‌రెడ్డి (వికెట్ కీపర్), పున్నయ్య, స్టాండ్‌బైస్: మికిల్ జైశ్వాల్, అవినాష్‌రావు (వికెట్ కీపర్), కార్తికేయ, ప్రణవ్‌వర్మ, నితీశ్‌రెడ్డి.

# దిల్లీ బోణీ యూపీపై విజయం



**మహిళల ప్రీమియర్ లీగ్‌లో దిల్లీ క్యాపిటల్స్ బోణీ కొట్టింది. లిజెలీ లీ, షెఫాలి.. చెలరేగిన వేళ బుధవారం యూపీ వారియర్స్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. రెండేసి మ్యాచ్‌లు ఓడి.. తొలి విజయం కోసం పోరాడిన ఈ జట్ల మధ్య పోరులో దిల్లీ మొదట బంతితో.. తర్వాత బ్యాటుతో రాణించింది. మరిజేన్ కాప్ (2/24), షెఫాలి వర్మ (2/16) విజృంభించడంతో తొలుత యూపీని 154/8కు పరిమితం చేసిన దిల్లీ.. సరిగ్గా 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. లిజెలీ లీ (67; 44 బంతుల్లో 8×4, 3×6), షెఫాలి వర్మ (36; 32 బంతుల్లో 6×4) మెరుపు బ్యాటింగ్‌తో ఆ జట్టు త్వరగానే గెలిచేలా కనిపించింది. కానీ వారిద్దరు ఔటవడంతో విజయం కాస్త ఆలస్యమైంది.**

ధనాధన్: ఛేదనలో దిల్లీకి మెరుపు ఆరంభం లభించింది. ఓపెనర్లు లిజెలీ లీ, షెఫాలీ బౌలర్లను అసలు లెక్కే చేయలేదు. లిజెలీ ఓవర్‌కు ఒకట్రెండు ఫోర్లతో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచింది. ట్రయాన్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో రెండు ఫోర్లు, ఒక సిక్స్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. షెఫాలి కూడా చెలరేగడంతో 6.1 ఓవర్లలో దిల్లీ స్కోరు 50 దాటింది. లిజెలీ 31 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించింది. ఓపెనర్ల జోరు చూస్తే ఆ జట్టు 15 ఓవర్లలోనే మ్యాచ్ ముగించేలా కనిపించింది. కానీ.. మూడు ఓవర్ల వ్యవధిలో షెఫాలి, లిజెలీ నిష్క్రమించడంతో పరుగుల వేగం తగ్గింది. వోల్వార్ట్ (25 నాటౌట్), జెమీమా (21) రాణించారు. త్వరగా మ్యాచ్‌ను ముగించే క్రమంలో జెమీమా ఔటైంది. కానీ ఎలాంటి నాటకీయతకు చోటివ్వకుండా జట్టును వోల్వార్ట్ విజయ తీరాలకు చేర్చింది.

హర్లీన్ రిటైర్డ్ ఔట్: అంతకుముందు పరుగుల కోసం యూపీ తీవ్రంగా శ్రమించింది. యూపీ ఖాతా తెరవకుండానే ఓపెనర్ కిరణ్ వికెట్‌ను కోల్పోయింది. మరిజేన్ ఖాతాలో ఆమె వికెట్ చేరింది. వికెట్లు కోల్పోకూడదన్న లక్ష్యంతో కనిపించిన యూపీ జాగ్రత్తగా ఆడింది. లిచ్‌ఫీల్డ్ (27) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన హర్లీన్ డియోల్ (47; 36 బంతుల్లో 7×4) కెప్టెన్ మెగ్ లానింగ్ (54; 38 బంతుల్లో 9×4, 1×6)కు చక్కటి తోడ్పాటు అందించింది. మూడో వికెట్‌కు ఈ జోడీ 85 పరుగులు జోడించింది. అర్ధసెంచరీ పూర్తయ్యాక నందని బౌలింగ్‌లో మెగ్‌లానింగ్ ఔటయింది. పరుగుల వేగం పెంచాలన్న ఉద్దేశంతో ఆ తర్వాతి ఓవర్లో హర్లీన్‌ను యూపీ రిటైర్డ్ ఔట్ చేసింది. అప్పటికి జట్టు స్కోరు 17 ఓవర్లలో 141/4. కానీ యూపీ వ్యూహం బెడిసికొట్టింది. చివరి మూడు ఓవర్లలో మరో నాలుగు వికెట్లు కోల్పోయిన ఆ జట్టు 13 పరుగులే చేయగలిగింది. పొదుపుగా బౌలింగ్ చేయడంతో పాటు రెండు వికెట్లు పడగొట్టిన షెఫాలి యూపీని దెబ్బతీసింది.

**సంక్షిప్త స్కోర్లు**

**యూపీ వారియర్స్: 154/8 (మెగ్ లానింగ్ 54, లిచ్‌ఫీల్డ్ 27, హర్లీన్ డియోల్ 47; మరిజేన్ కాప్ 2/24, షెఫాలి వర్మ 2/16)**
**దిల్లీ క్యాపిటల్స్ 158/3 (లిజెలీ లీ 67, షెఫాలి 36, వోల్వార్ట్ 25 నాటౌట్, జెమీమా 21; దీప్తి శర్మ 2/26, ఆశా శోభన 1/20)**

## ఎలాంటి ఇబ్బంది లేదు

**దిల్లీ: ఇండియా ఓపెన్‌కు వేదికగా ఉన్న ఇందిర గాంధీ ఇండోర్ స్టేడియంలో ఎలాంటి ఇబ్బంది లేదని, పరిస్థితులు బాగున్నాయని భారత అగ్రశ్రేణి ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ అన్నాడు. స్టేడియంలో ఎలాంటి అపరిశుభ్ర వాతావరణం చూడలేదని.. చిన్నపాటి నిర్వహణ సవాళ్లు ఎక్కడైనా సాధారణమేనని శ్రీకాంత్ తెలిపాడు. టోర్నీ ఏర్పాట్లపై మంగళవారం డెన్మార్క్ క్రీడాకారిణి మియా బ్లిక్‌ఫెల్డ్ అసంతృప్తి వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. "వివాదం గురించి నాకు తెలియదు. ప్రతి దేశంలో పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. సింగపూర్‌లో గాలివాటం ఎక్కువగా ఉంటుంది. మలేసియాలో ఆ ప్రభావం కాస్త తక్కువ. గతంలో ఇండోనేసియాలో వేగంగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రతి దేశంలో కొన్ని సవాళ్లు సాధారణం" అని శ్రీకాంత్ తెలిపాడు.**

**కాలుష్యం వల్లే వైదొలిగా...**

**ఆంటోన్సెన్: భారత్ రాజధాని దిల్లీలో తీవ్రమైన వాయు కాలుష్యం కారణంగానే ఇండియా ఓపెన్ నుంచి వైదొలిగినట్లు ప్రపంచ మూడో ర్యాంకర్ ఆండర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్) అన్నాడు. "వరుసగా మూడో ఏడాది ఇండియా ఓపెన్ నుంచి ఎందుకు తప్పకున్నానని తెలుసుకునేందుకు చాలామందిలో ఆసక్తి ఉంది. ప్రస్తుతం దిల్లీలో తీవ్ర వాయు కాలుష్యం ఉన్నందున బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహణకు ఇది సరైన ప్రదేశమని అనుకోను" అని ఆంటోన్సెన్ తెలిపాడు.**



## డారిల్ మిచెల్, విల్ యంగ్ మెరుపులు.. రెండో వన్డేలో న్యూజిలాండ్ విజయం

రాజ్‌కోట్: భారత్‌తో జరిగిన రెండో వన్డేలో న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను కివీస్ 11తో సమం చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని న్యూజిలాండ్ 47.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. డారిల్ మిచెల్ (131*; 117 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకం బాదాడు. విల్ యంగ్ (87; 98 బంతుల్లో 7 ఫోర్లు) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఓపెనర్లు డేవాన్ కాన్వే (16), హెన్రీ నికోల్స్ (10) త్వరగానే నిష్క్రమించినా.. తర్వాత వచ్చిన విల్ యంగ్, డారిల్ మిచెల్ మూడో వికెట్‌కు 162 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. గ్లెన్ ఫిలిప్స్ (32*; 25 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్‌దీప్ యాదవ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 18న ఇందౌర్‌లో జరగనుంది.

**భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (112*; 92 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో మెరిశాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (56; 53 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ చేశాడు. రోహిత్ శర్మ (24), విరాట్ కోహ్లి (23), రవీంద్ర జడేజా (27), నితీశ్ రెడ్డి (20) పరుగులు చేశారు. శ్రేయస్ అయ్యర్ (8) నిరాశపర్చాడు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3, జేమీసన్, ఫాక్స్, జేడెన్ లెనాక్స్, మైకేల్ బ్రాస్‌వెల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.**

